ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
సోమవారం 18 నవంబరు 2024



కన్నీటి వీడ్కోలు

- పాడె మోసిన చంద్రబాబు, లోకేశ్
- చితికి నిప్పంటించిన నారా రోహిత్, గిరీష్
- హాజరైన మహారాష్ట్ర గవర్నర్ సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు

చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడికి నారావారిపల్లెలో ఆదివారం కన్నీటితో వీడ్కోలు పలికారు. హైదరాబాద్ నుంచి రామ్మూర్తి నాయుడి భౌతికకాయం చేరుకోక ముందునుంచే ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలలనుంచీ జనం నారావారిపల్లెకు పోటెత్తారు. ఇతర జిల్లాల నుంచి కూడా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలూ పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకించి చంద్రగిరి నియోజకవర్గంలో గతంలో రామ్మూర్తి నాయుడితో కలసి పని చేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో కనిపించారు. తమలో ఒకడిగా ఆప్యాయంగా మెలగిన రామ్మూర్తి నాయుడిని చివరిసారి చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. కొందరు కన్నీటి పర్యంతం అయ్యారు. నారావారిపల్లెకు ఇరువైపులా ఖాళీగా వున్న పంట పొలలాన్నీ వాహనాలతో నిండిపోయాయి.

- తిరుపతి/చంద్రగిరి, ఆంధ్రజ్యోతి





డప్పు కొట్టిన మంద కృష్ణ

మాదిగ ఉద్యమం నారావారిపల్లె నుంచి మొదలు పెట్టినపుడు రామ్మూర్తి నాయుడు తమను ఆదరంగా చూసుకున్నారంటూ ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ జ్ఞాపకం చేసుకున్నారు. ఆయనకు నివాళిగా డప్పు కొట్టారు.

కన్నీటి పర్యంతం

తమ్ముడి పార్థివదేహాన్ని అంతిమయాత్రకు కదిలించినపుడు, అంత్యక్రియల సందర్భంలోనూ చంద్రబాబు కన్నీటి పర్యంతమయ్యారు. లోకేశ్ కూడా గంభీరంగా ఉండిపోయారు. రోహిత్, గిరీష్ విలపించారు.

తమ్ముడి పాడె మోసిన చంద్రబాబు

రామ్మూర్తినాయుడి అంతిమయాత్ర సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆయన పాడె మోశారు. ఇంటి వద్ద నుంచీ సమీపంలోని సొంత మామిడి తోట వరకూ సాగిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే పులివర్తి నానీతో కలిసి చంద్రబాబు పాడె మోశారు.

పినతండ్రి పార్థివదేహం వెంట వచ్చిన లోకేశ్

ఉదయం 7.45 గంటలకల్లా రామ్మూర్తినాయుడి పార్థివదేహం రేణిగుంటకు ప్రత్యేక విమానంలో చేరుకుంది. నారా లోకేశ్, నారా రోహిత్, గిరీష్, రామ్మూర్తి భార్య ఇందిర వెంట వచ్చారు. 8.39 గంటలకు పార్థివదేహంతో పాటు రోడ్డు మార్గాన బయల్దేరి 9.06 గంటలకల్లా నారావారిపల్లెకు చేరుకున్నారు. స్వగృహం ఆవరణలో రామ్మూర్తి నాయుడు భౌతికకాయాన్ని బంధుమిత్రులు, టీడీపీ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం వుంచారు.

అమ్మానాన్నల సమాధుల దగ్గరే..

మధ్యాహ్నం 1.30 గంటల నుంచీ అంత్యక్రియలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. అనంతరం 2.33 గంటలకు ఇంటి వద్ద నుంచీ అంతిమయాత్ర ప్రారంభమైంది. చేరువలోనే వున్న సొంత మామిడి తోపులో చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల సమీపంలోనే అంత్యక్రియలు జిల్లా యంత్రాంగం అధికార లాంఛనాల నడుమ జరిగాయి.తొమ్మిదిమంది ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. 3.50 గంటలకు తనయులు నారా రోహిత్, నారా గిరీష్‌లు తండ్రి చితికి నిప్పంటించారు.

నేటి మధ్యాహ్నం దాకా పల్లెలోనే చంద్రబాబు, లోకేశ్

సీఎం చంద్రబాబు తిరుగు ప్రయాణం అధికారికంగా ఇంకా ఖరారు కాలేదు.సోమవారం మధ్యాహ్నం వరకూ నారావారిపల్లెలోనే వుంటారని సమాచారం. సతీమణి భువనేశ్వరి, తనయుడు లోకేశ్ కూడా ఆయనతో పాటే నారావారిపల్లిలోనే వుండనున్నారు. ఆదివారం రాత్రి నుంచీ సోమవారం సాయంత్రం దాకా గ్రామస్తులు, సన్నిహిత బంధువులనూ ఆయన కలవనున్నట్టు తెలిసింది.





అంత్యక్రియలకు రాజకీయ, సినీ ప్రముఖులు

రామ్మూర్తి నాయుడి అంత్యక్రియలకు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నివాళులు అర్పించారు. మహారాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణ, హీరోలు మోహన్ బాబు, నాగశౌర్య, రాజేంద్ర ప్రసాద్, మంచు మనోజ్, నిర్మాత ఎన్వీ ప్రసాద్, మాజీ మంత్రులు అమరనాథరెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కొత్తపల్లి సుబ్బరాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చంద్రగిరి, నగరి, శ్రీకాళహస్తి, చిత్తూరు, సత్యవేడు, పూతలపట్టు, వెంకటగిరి, చింతలపూడి, పెదకూరపాడు, మడకశిర ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, కోనేటి ఆదిమూలం, మురళీమోహన్, కురుగొండ్ల రామకృష్ణ, రోహణ్ కుమార్, భాష్యం ప్రవీణ్, ఎంఎస్ రాజు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సి.ఆర్.రాజన్, చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు ఎ.మోహన్, సుగుణమ్మ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ఊకా విజయకుమార్, పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, ఆర్సీ మునికృష్ణ, వీరబల్లి హేమాంబరధర రావు, కోడూరు బాల సుబ్రమణ్యం, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ, ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీయూ వీసీ అప్పారావు, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి,స్విమ్స్ సీఎంవో శివశంకర్ తదితరులు హాజరైన వారిలో వున్నారు.









నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణ, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సినీనటులు రాజేంద్ర ప్రసాద్, మంచు మనోజ్, మంచు మోహన్‌బాబు

నారావారిపల్లెలో భారీ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సహా ప్రముఖులంతా ఆదివారం నారావారిపల్లెకు రావడంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వు బలగాలు, బాంబు, డాగ్ స్క్వాడ్లు తనిఖీలు చేపట్టాయి. తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి దాదాపు 800 మంది పోలీసులు, రోప్ పార్టీలు, బాంబు డిగ్గింగ్ పార్టీలు నారావారిపల్లెకు వచ్చాయి. గ్రామంలో ఎటు చూసినా పోలీసులే కనిపించారు. రామ్మూర్తి నాయుడి భౌతికకాయానికి నివాళులు అర్పించడానికి ప్రముఖులతో పాటు బంధువులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, టీడీపీ నేతలు, శ్రేణులు తరలిరావడంతో తొక్కిసలాట జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించడానికి వీలుగా ప్రముఖులు, ప్రజలు, బంధుమిత్రులకు వేర్వేరుగా ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం అంత్యక్రియలు ముగిసే వరకు ఎస్పీ సుబ్బరాయుడు అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారం రాత్రి నారావారిపల్లెలోనే ఉండటంతో ఇంటి చుట్టూ భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌జీ బృందాలతో పాటు పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. అనుమతి ఉన్న వారినే నివాస స్థలం వద్దకు పంపుతున్నారు. ఇంటికి ప్రధాన ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. ఎ.రంగంపేట రోడ్డు నుంచి గ్రామం వరకూ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ప్రతి 500 అడుగులకు ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేసినట్లు పోలీసు వర్గాలు చెప్పాయి. ఇటు పోలీసులు అటు ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసులు సంయుక్తంగా బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.తిరుపతి అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, రిజర్వు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, తిరుపతి డీఎస్పీ వెంకట నారాయణ, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్ కుటుంబాల నివాళులు

ఉదయం 10.40 గంటలకు సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మణి, మనవడు నారా దేవాన్ష్, సోదరి హైమావతి హైదరాబాదు నుంచి రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకున్నారు. రోడ్డు మార్గాన 11.22 గంటలకు నారావారిపల్లె చేరుకున్నారు. రామ్మూర్తి నాయుడి పార్థివ దేహానికి చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, హైమావతి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు నారావారిపల్లెకు వచ్చిన మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌కు నారా లోకేశ్ పాదాభివందనం చేశారు.



రామ్మూర్తి భౌతికకాయం వద్ద విషాదంలో బంధువులు

గొలుసు దొంగల అరెస్టు

- రూ. 30 లక్షల నగలు, మోటర్‌సైకిళ్ల స్వాధీనం



చైన్‌స్నాచర్లను చూపుతున్న ఎస్పీ మణికంత తదితరులు

పలమనేరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : కొంతకాలంగా ఒంటరి మహిళలకు కునుకు లేకుండా చేస్తున్న చైన్ స్నాచర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల గొలుసు దొంగతనాలు బాగా పెరిగిన విషయం తెలిసిందే.మహిళలకు బయటికెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో 8మంది చైన్ స్నాచర్లను అరెస్టు చేసి రూ. 30 లక్షలకు పైగా విలువ చేసే బంగారు నగలు, మోటరు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు.పలమనేరు డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ మణికంఠ వివరాలను వెల్లడించారు. పుంగనూరులో ఈనెల 1వతేది ఓ మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లారు.పుంగనూరు ఆర్టీసీ డిపోలో పని చేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి బుక్యాప్రసాద్‌నాయక్ ఈనెల 15వతేది పుంగనూరు మినీ బైపాస్ రోడ్డుపై వెళ్తున్న ఓ మహిళ మెడలోనుంచి చైన్ లాక్కెళ్తుండగా స్థానికులతో కలిసి పుంగనూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ లోకేష్ వెంబడించారు.అతడిని అరెస్టుచేసి రూ. 6.50 లక్షల విలువైన 69 గ్రాముల మూడు బంగారు చైన్లు, ఒక మోటరు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. లోన్ యాప్‌లో రుణాలు తీసుకొని చెల్లించలేక ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. కొద్ది రోజులుగా చౌడేపల్లి, గంగవరం, కురబలకోట, రామసముద్రం, పలమనేరు, శాంతిపురం, బైరెడ్డిపల్లి మండలాల్లో ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలో బంగారు గొలుసులను లాక్కెళ్లిన ఏడుగురిని అరెస్టు చేసి చైన్లను స్వాధీనం చేసుకున్నారు.అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లి మండలం ఏటిగడ్డపల్లికి చెందిన ముద్దం చంద్రశేఖర్(32), హరికృష్ణ(24), మదనపల్లెకు చెందిన దాసరి నాగరాజు అలియాస్ నాగ (38), ఎల్. భాస్కర్(37),కె. పవన్ కుమార్(27) బి.కొత్తకోటకు చెందిన పి.బావాజాన్ (35), చౌడేపల్లి మండలం మదుకూరుకు చెందిన గుంతలపేట లక్ష్మీపతి అలియాస్ చంటి(30) అరెస్టు అయిన వారిలో వున్నారు. వీరి వద్ద చోరీ చేసిన 332 గ్రాములు బంగారు ఆభరణాలు, దొంగతనాలకు ఉపయోగించిన మూడు మోటరు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు.డీఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో చైన్‌స్నాచర్స్‌ను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఏఎస్ఐ శ్రీనివాసులు నాయుడు, కానిస్టేబుళ్లు అల్లావుద్దీన్, శశిధర్, బాలాజి, రెడ్డెప్ప, వెంకటరమణ, ఎల్లప్పలకు రివార్డులను ఎస్పీ అందజేశారు.అలాగే గొలుసులను పోగొట్టుకున్న బైరెడ్డిపల్లి మండలం రామసముద్రం గ్రామానికి చెందిన అలివేలుతో పాటు మరో ఇద్దరు మహిళలకు బంగారు చైన్లను ఎస్పీ మణికంఠ అందజేశారు.



రివార్డు అందుకుంటున్న ఏఎస్ఐ శ్రీనివాసులు నాయుడు

ద్రావిడ వర్సిటీలో రూ.2.61 కోట్లు దారి మళ్లింపు

- నాలుగేళ్లు ఉద్యోగుల జీఎస్టీ, ఈఎస్ఐ చెల్లించని గౌసియా అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ



చిత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ద్రావిడ యూనివర్శిటీలో మరో అవినీతి బాగోతం బయటపడింది. ఇక్కడి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ తమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన జీఎస్టీ, ఈఎస్ఐ నిధుల్ని దారి మళ్లించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కుంభకోణం జరగ్గా.. తాజాగా బయటపడింది. ద్రావిడ యూనివర్శిటీలో 254 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. గౌసియా వలంటీర్ సొసైటీ పేరుతో ఓ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ 15 ఏళ్లుగా ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తోంది. వర్శిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల కోసం నెలకు సుమారు రూ.43 లక్షల్ని చెల్లిస్తోంది.ఈ ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం 12 నెలల జీతాలను పెండింగులో పెట్టగా.. ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రూ.2.86 కోట్ల పెండింగు జీతాల్ని విడుదల చేశారు. ఇదిలా ఉండగా, 2019 డిసెంబరు నుంచి 2023 అక్టోబరు వరకు ఉద్యోగులకు సంబంధించిన జీఎస్టీ బిల్లులు రూ.2.54 కోట్లు చెల్లించలేదని.. అలాగే 2019లో మూడు నెలలకు చెందిన ఈఎస్ఐ బిల్లులు రూ.7.03 లక్షల్ని చెల్లించలేదని తాజాగా బయటపడింది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు వర్శిటీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి పొక్కింది. దీన్ని చార్టెడ్ అకౌంటెంట్‌తో పలుసార్లు నిర్ధారించుకున్న వర్శిటీ అధికారులు ఏజెన్సీ నిర్వాహకులకు రెండుసార్లు నోటీసుల్ని అందించినట్లు సమాచారం. అయినా ఏజెన్సీ నిర్వాహకులు స్పందించలేదు. అంతేకాకుండా, వైసీపీ హయాంలో వర్శిటీలో కీలకంగా పనిచేసిన అధికారిని కలవడంతో వర్శిటీ ఉద్యోగుల్లో విపరీతంగా చర్చ మొదలైంది. ఈ నిధుల దారి మళ్లింపు వెనుక అప్పటి అధికారుల హస్తం ఉందా అనేది విచారణలో తేలాల్సి ఉంది. ఈ విషయాన్ని సోమవారం వర్శిటీ అధికారులు ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకుని వెళ్లే అవకాశాలున్నాయి. ప్రస్తుత రిజిస్ట్రార్ కిరణ్‌ను ఈ విషయమై వివరణ కోరగా.. గౌసియా సొసైటీ వారు జీఎస్టీ, ఈఎస్ఐ చెల్లించకుండా పెద్దమొత్తంగా నిధుల్ని పక్కదారి పట్టించినట్లు తేలిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



నారా రామ్మూర్తి అంత్యక్రియల వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యేలు తదితరులు

నారా రామ్మూర్తి జ్ఞాపకాల్లో...

తిరుపతిరూరల్/ తిరుపతి(జీవకోన), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెకు ఆదివారం ప్రముఖులు తరలివచ్చారు. సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మహారాష్ట్ర గవర్నరు రాధాకృష్ణ కోసం మంత్రి లోకేశ్ ఇంటిముందు కొంతసమయం వేచి ఉన్నారు. ఆయన వచ్చాక పాదాభివందనం చేసి ఇంటి లోపలకు తీసుకెళ్లారు. కాగా, రామ్మూర్తి నాయుడితో తమ అనుబంధాన్ని పలువురు పంచుకున్నారు.

మంచి మిత్రుడిని కోల్పోయా

ఆరోజుల్లో నేను రామ్మూర్తినాయుడు మంచి స్నేహితులం. 30ఏళ్లుగా మంచి మిత్రులం. అప్పట్లో తిరుపతిలో ఎక్కువ సినిమా షూటింగులు చేశాను. దీనిలో 80-90శాతం సినిమాలు హిట్ అయ్యాయి. మంచి మిత్రుడిని కోల్పోయాను.

- రాజేంద్రప్రసాద్, సినీ నటుడు

మేమిద్దరం కలసి పనిచేశాం

శాసనసభ్యులుగా నేను రామ్మూర్తినాయుడు కలసి పని చేశాం. సెంట్రల్‌బ్యాంకులో నేను ఎలక్ట్‌కావడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు.చాలా ఏళ్ల ప్రజాజీవితానికి దూ రంగా ఉన్నారు.తిరిగి జిల్లాపార్టీ అధ్యక్షుడిగా పార్టీలోకి తీసు కొచ్చా.చంద్రగిరి ప్రజలు ఆయన్ను ఎప్పటికీ మరువలేరు.

- అమరనాథరెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే

పూతలపట్టుకు తీరనిలోటు

రామ్మూర్తినాయుడి మరణం పూతలపట్టు నియోజకవర్గానికి తీరనిలోటు. ఐరాలమండలం గతంలో చంద్రగిరి నియోజకవర్గంలో కలసి ఉండేది.50సంవత్సరాల ముందు చూపు తో ఆయన చేసిన అభివృద్ధి నా విజయానికి ఎంతగానో ఉపయోగపడింది. అర్ధరాత్రయినా ఎవరు ఫోను చేసినా ఏమాత్రం ఆలోచించకుండా వెళ్లి సహాయం చేసేవారు.

- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

అందరితో కలుపుగోలుగా ఉండేవారు

నియోజకవర్గంలో అందరితో కలుపుగోలుగా ఉండేవారు. నాకన్నా ఏడాది చిన్నవారు. ప్రత్యేకంగా చిత్తూరుతో ఆయనకు విడదీయరాని బంధం ఉంది. 1998లో చిత్తూరుమున్సిపల్ చైర్మన్‌గా ఏఎస్ మనోహర్ ఎంపికకావడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన లేనిలోటు తీర్చలేనిది.

- దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ

కాణిపాకానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చారు

కాణిపాక ఆలయానికి మంచి మాస్టర్‌ప్లాన్ రూపొందించి ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇది విషాదకరసందర్భం. ఆయన మరణం తీరనిలోటు.

- గురజాల జగన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

నాన్నతో మంచి అనుబంధం

నాన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డితో రామ్మూర్తి నాయుడికి మంచి అనుబంధం ఉండేది. ఆయన మరణం జీర్ణించుకోలేకపోతున్నా. సీఎం చంద్రబాబు, వారి కుటుంబ సభ్యులకు ఆ దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తున్నా.

- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

రామ్మూర్తినాయుడి మృతి బాధాకరం

తిరుచానూరు,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నారా రామ్మూర్తి నాయుడి మృతి బాధాకరమని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు.ఈ మేరకు గవర్నర్ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.నారా రామ్మూర్తినాయుడు మరణ వార్త తనకు తీవ్రదుఃఖాన్ని కలగించిందన్నారు. ఎమ్మెల్యేగా చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. 2002లో తాను కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో తనతో పాటు జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించారని గుర్తు చేసుకున్నారు. రాయలసీమ నుంచి ఒక మంచి నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమని, ఆయన మృతికి తన సంతాపాన్ని తెలిపారు.



నారా రామ్మూర్తి నాయుడి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, మురళీమోహన్, గురజాల జగన్మోహన్, అమరనాథరెడ్డి, ఆదిమూలం, బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు

నత్తనడకన ఇంటింటి మ్యాపింగ్

● సచివాలయ ఉద్యోగుల అలసత్వానికి తోడు సాంకేతిక సమస్యలతో 51శాతమే పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిపాలనలో మరింత పారదర్శకతతో పాటు ప్రజలకు వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రారంభించిన ఇంటింటి మ్యాపింగ్ ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోంది పల్లె, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటినీ మ్యాపింగ్ (జియోట్యాగింగ్) చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర డైరక్టర్ ఎం. శివప్రసాద్ ఈ నెల మొదటి వారంలో ఉత్తర్వులు జారీచేశారు. 15వ తేది నాటికి సర్వే పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు. అయితే కొందరు సచివాలయ ఉద్యోగులు సర్వేకి దూరంగా ఉండడం, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ కొరవడడంతో ఈ మ్యాపింగ్ 17వ తేదీకి 51శాతం మాత్రమే పూర్తయింది. పంచాయతీలు, పురపాలక, మున్సిపాలిటీల్లో 5,91,601 కుటుంబాలు ఉంటున్నాయి. గత ఒక్కో క్లస్టర్ పరిధిలో 10-20 కుటుంబాలు కనిపించడం లేదు. వారు స్థానికంగా లేకపోయినా గతంలో హ్యాబిటేషన్ ఆఫీసర్లు మ్యాపింగ్ చేయడమే ఇందుకు కారణం.

● సెలవుపై సచివాలయ ఉద్యోగులు

జిల్లాలో 612 గ్రామ, వార్డు సచివాలయాలుండగా, 4114 మంది సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు. 5298మంది ఉద్యోగులు విధుల నుంచి ఎన్నికల సమయంలో తప్పుకున్నారు. ఉన్నవారు సైతం సర్వే చేయకుండా అనధికారిక సెలవుపై వెళ్లిపోయారు. వారి పరిధిలోని క్లస్టర్లలో కుటుంబాల సర్వే ఇతర సిబ్బందికి భారంగా మారింది. మరికొందరు తమకు అనారోగ్యమని, డీఎస్సీకి సిద్ధమౌతున్నామని, ఉన్నత కొలువులకోసం శిక్షణ తీసుకుంటామని పలు కారణాలతో సెలవుపై వెళ్లిపోయారు. దీంతో కనీసం వెయ్యి నుంచి రెండువేల మంది సచివాలయ ఉద్యోగులు సర్వేచేయడం లేదని సమాచారం.

● ఆప్షన్లేవీ?

సాంకేతికపరంగా నవీకరించిన యాప్ ద్వారా సచివాలయ సిబ్బంది తమ సెల్‌ఫోన్‌లో కుటుంబ వివరాలు నమోదు చేస్తున్నారు. క్లస్టర్లవారీగా వివరాలు సేకరించి, ఫొటో తీసి నమోదు చేయాల్సివుంది. ఆ తర్వాత కుటుంబసభ్యుల్లో ఒకరినుంచి ధ్రువీకరణ కోసం వేలిముద్రలు లేదా ఐరిస్‌ను అనుసంధానం చేయాలని ఆదేశాలందాయి. బయోమెట్రిక్ తీసుకునేందుకు చాలాచోట్ల పరికరాలు పనిచేయడం లేదు. 50శాతం మందికి అసలు పరికరాలివ్వలేదని ఆరోపిస్తున్నారు. మరి కొన్ని చోట్ల మొబైల్ నెట్‌వర్క్ సమస్య వుంది.డ్యాష్‌బోర్డులో మృతుల డిలీషన్, అడిషన్ ఆప్షన్ లేదు. దీంతో ఇండ్ల వద్దకు వెళ్తే కొత్తగా చేరిన వారి పేర్ల మ్యాపింగ్‌కు ఆప్షన్ లేదు. దీని గురించి ఎక్కడా వివరాలు చెప్పడం లేదు.స్థానికంగా లేని కుటుంబాలను షిఫ్టింగ్ అని చూపేందుకు యాప్‌లో ఆప్షన్ లేకపోవడంతో మ్యాపింగ్‌ను పక్కన పెట్టేస్తున్నారు. దాదాపు 20వేల కుటుంబాలు కనిపించడం లేదని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు. మైగ్రేషన్, అద్దె, సింగిల్ ఉమెన్ వివరాల నమోదుకు, తొలగింపునకు ఎడిట్ ఆప్షన్ లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

‘శ్రీనివాస సేతు’ కాదు
గరుడ వారధే!

తిరుపతి, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ, తిరుపతి స్మార్ట్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మితమైన ఫ్లైఓవర్ పేరు ఎట్టకేలకు మారింది. అందరినోట గరుడ వారధిగానే ప్రాచుర్యంలోకి వచ్చిన పేరు మళ్లీ అధికారికంగా మారింది. 2019 ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో గరుడ వారధిగానే తిరుపతిలో ఫ్లైఓవర్ ప్రాజెక్టుకు పునాదులు పడ్డాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ప్రభుత్వంలో పెట్టిన గరుడ పేరు ఉండకూడదన్న ఆలోచనతో కార్పొరేషన్ కౌన్సిల్లో అప్పటి ఎమ్మెల్యే పేరు మార్పుతూ తీర్మానం చేశారు. గరుడ పేరును ఇంట్లో నామకరణానికి ముందు పిలుచుకునే పప్పీ, చిట్టీ లాంటిదని, నామకరణం చేసినతర్వాత పెట్టిన పేరే శాశ్వతమవుతుందని అందుకే ‘శ్రీనివాస సేతు’గా మార్చుతున్నట్టు ప్రకటించారు. గరుడ పేరును ఎందుకు తీసేయాల్సి వస్తోందో తనదైన శైలిలో పౌరాణిక నేపథ్యాన్ని వివరించారు. దీంతో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ అభ్యంతరం వ్యక్తం చేస్తూ గరుడ వారధిగానే గుర్తింపు తెచ్చుకుందని, అదే పేరును కొనసాగించాలని మేయరు పోడియం వద్దకు వెళ్లి గోవింద నామస్మరణలతో వేడుకున్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు పెట్టిన పేరును కొనసాగించాల్సిన అవసరం తమకు లేదని కొత్త పేరునే అధికారికంగా కౌన్సిల్ తీర్మానం చేస్తోందని ఎమ్మెల్యేతో పాటు పలువురు సభ్యులు వాదించారు. దీనిపై నిరసన తెలుపుతూ ఆర్సీ మునికృష్ణ అప్పటి కౌన్సిల్ సమావేశాన్ని వాకౌట్ చేసి సమావేశ మందిరం నుంచి బయటకు వెళ్లిపోయారు. పేరు మార్పు సరికాదని ఆతర్వాత టీడీపీ నాయకులు పలుసార్లు ఆందోళన చేపట్టారు. అధికార బలంతో శ్రీనివాస సేతుగా పేరు మార్చగలిగారు గాని నానుడిలో మాత్రం గరుడ వారధిగానే వినిపించేది. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్వపు పేరే నిలిచింది. వారధి నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ మేనేజర్ రంగస్వామి శనివారం సాయంత్రం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈక్రమంలో గరుడ వారధి పేరు ఉంచాలని ఛైర్మన్ ఆదేశించడంతో ఆదివారం తెల్లవారు జామున వారధికి ఉన్న శ్రీనివాస సేతును గరుడ వారధిగా మార్చేశారు. గరుడ వారధిగానే పిలిచేలా జరగబోయే పాలకమండలి సమావేశంలో తీర్మానం చేయనున్నట్టు తెలిసింది.

1,500 లీటర్ల సారా ఊట ధ్వంసం

గుడిపాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని రాసనపల్లె అటవీప్రాంతంలో ఉన్న సారా స్థావరాలపై ఆదివారం ఉదయం పోలీసులు దాడులు చేశారు. సుమారు 1,500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సారా తయారీ, విక్రయాలపై సమాచారం ఇవ్వాలని కోరారు.



సారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ

టీడీపీ సభ్యత్వం తీసుకున్న 98 ఏళ్ల అవ్వ



కుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో 98 ఏళ్ల వృద్ధురాలు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు.1.25 లక్షల సభ్యత్వాల లక్ష్యంతో కార్యకర్తలు ముమ్మరంగా పల్లె పల్లె తిరుగుతున్నారు. కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కూసూరులో కన్నమ్మ అనే 98 ఏళ్ల వృద్ధురాలు ఆదివారం సభ్యత్వం తీసుకుని చంద్రబాబుమీద తన అభిమానాన్ని చాటుకున్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, ఐటీడీపీ వినోద్ కుమార్ ఇంటింటికీ వెళ్లినపుడు ఆ వృద్ధురాలు పలకరించి పార్టీ సభ్యత్వం తీసుకుంది. ‘ఊపిరి ఉన్నంతదాకా నా ఓటు చంద్రబాబుకే’ అని కూడా ఆమె వారితో అనడం విశేషం.

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు
కాణిపాకంలో భక్తుల రద్దీ



క్యూలైన్లలో వేచివున్న భక్తులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించారు. మంచి ముహూర్తం ఉండటంతో ఆలయం వద్ద పదుల సంఖ్యలో వివాహాలు జరిగాయి.

కలెక్టరేట్‌లో నేడు ‘పీజీఆర్ఎస్’

చిత్తూరు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు(పాత) కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

స్కూళ్ల సమయం పెంపు సరికాదు:ఆపస్

తిరుపతి(విద్య), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమయాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాలాజీ, ప్రధాన కార్యదర్శి, జీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రకరకాల యాప్‌లు, శిక్షణలు, వివిధ బోధనేతర పనులతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులకు పాఠశాలల పని సమయం పెంపు పెను భారమవుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల పని సమయాన్ని పెంచాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 వరకు, లేదా 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు సమయాన్ని నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అపార్ కారణంగా ప్రధానోపాధ్యాయులు పదవ తరగతి నామినల్ రోల్స్‌ను సమర్పించలేక పోతున్నారని, అందువల్ల నామినల్ రోల్స్ సమర్పణకు గడువును పెంచాలని కోరారు.

విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడుదామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ ఎస్వీయూలో ఆదివారం జరిగింది. విద్యార్థి సంఘం నగర కార్యదర్శి మోహన్ కుమార్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మహా సభను ప్రారంభించారు. అనంతరం పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎస్వీయూలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో శివారెడ్డి, మరో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ 89 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఉచిత విద్య, అందరికీ సమానమైన విద్యా విధానం కోసం అలుపెరగకుండా పోరాటాలు చేస్తోందన్నారు. ఐతే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వలన పేదలకి విద్య అందని ద్రాక్షలా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో దేశవ్యాప్తంగా 60 వేల ప్రభుత్వ పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారని, దీనివలన లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. సెంట్రల్ యూనివర్సిటీల్లోను, జాతీయ విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీట్ల సంఖ్యను కుదించి వేయనున్నారని, దీనివల్ల ఉన్నత విద్య మరింత ఖరీదు కానుందని హెచ్చరించారు. సుమారు 70వేల మంది ఎస్సీ ఎస్టీ విద్యార్థులు జీఓ నంబర్ 77 వల్ల ఉన్నత, పీజీ విద్యకు దూరంకానున్నారని తెలియజేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారా లోకేశ్ జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని కోరారు. సంక్షేమ హస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య ఉద్యమ పాటలతో విద్యార్థుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమాల్లో సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మంజునాథ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ కుమార్, సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, పుత్తూరు మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, యూనివర్సిటీ నాయకులు చిన్న, జిల్లా ఆఫీస్ బేరర్స్ చందు, సూర్య, హరికృష్ణ, గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు సతీష్, యూనివర్సిటీ సెక్రటరీ చంద్రనాయక్, మహిళా కన్వీనర్లు మల్లిక, శివరామ కుమారి, వెన్నెల, నగర్ నాయకులు మోహన్, పులికొండ, గణేష్ అభిలాష్, చంద్రగిరి నాయకులు ఆనంద్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీయూలో ఏఐఎస్ఎఫ్ నాయకుల ప్రదర్శన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆరుగురు సిబ్బందిపై వేటు

సెల్‌ఫోన్ నిబంధనలు పాటించకపోవడమే కారణం

శ్రీకాళహస్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెల్‌ఫోన్ నిషేధం ఆంక్షలను పాటించని ఆరుగురు సిబ్బందిపై ఈవో బాపిరెడ్డి వేటు వేశారు. ఆలయంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లతో ప్రవేశించకూడదన్న నిబంధన అమల్లో ఉంది. ఆదివారం ఈవో బాపిరెడ్డి సామాన్య భక్తుడి తరహాలో ఆలయంలో సంచరించారు. పలువురు ఉద్యోగులు దర్జాగా సెల్‌ఫోన్‌ను ఆలయంలోకి తీసుకెళ్లడమే కాకుండా మాట్లాడటం, వీడియోలు చూస్తూ కాలక్షేపం చేస్తుండటం వంటివి ఈవో స్వయంగా గుర్తించారు. ఒక హోంగార్డును మాతృసంస్థ అయిన పోలీసుశాఖకు సరెండర్ చేశారు. ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వహించే అటెండర్ స్థాయి ఉద్యోగిని సస్పెండ్ చేశారు. మరో నలుగురు సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆలయంలో ఎవరైనా నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ప్రకటన ద్వారా హెచ్చరించారు. కాగా, ఆదివారం ఆలయంలోని నిత్యాన్నదాన సత్రం, పడితరం స్టోర్స్‌ను ఈవో బాపిరెడ్డి తనిఖీ చేశారు. అన్నదానంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. స్టోర్స్‌లో సరుకుల నాణ్యత, తూకాలు, రికార్డులను ఆరా తీశారు.

భక్తులతో బస



భక్తులతో కలిసి నిద్రిస్తున్న భానుప్రకాష్ రెడ్డి

తిరుమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి ఆదివారం సామాన్య భక్తులతో కలిసి బస చేశారు. సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి తొలి సమావేశం జరగనుంది. ఈ క్రమంలో ఆయన ఆదివారం రాత్రి తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-1కి చేరుకుని సామాన్య భక్తులు, క్షురకులతో మాట్లాడారు. వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాను కాలినడక భక్తులు.. వసతి సముదాయంలో సామాన్య భక్తులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నట్లు చెప్పారు. వేడి నీళ్లు రావడం లేదని, మరుగుదొడ్లు శుభ్రంగా లేవనే ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై బోర్డులో చర్చిస్తామన్నారు. గత ఐదేళ్లలో కొందరివాడిగానే మిగిలిన స్వామివారిని అందరివాడిగా మారేలా చర్యలు తీసుకుంటామన్నారు.





స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు - భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఈవో శ్యామలరావు

వైభవంగా కార్తీక స్నపన తిరుమంజనం

తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజన మహోత్సవంలో భాగంగా ఆదివారం తిరుమలలోని వైభవోత్సవ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి స్నపన తిరుమంజన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం మలయప్పస్వామి, ఉభయనాంచారులను ఊరేగింపుగా వైభవోత్సవ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాధారణంగా కార్తీక సమయంలో పార్వేట మండపంలో టీటీడీ వనభోజనం నిర్వహిస్తుంది. భారీ వర్ష హెచ్చరికల నేపథ్యంలో ఈ ఏడాది వేడుకను తిరుమల ఆలయం ముందున్న వైభవోత్సవ మండపంలో నిర్వహించారు. స్నపనం తర్వాత భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్యామలరావు, డిప్యూటీ ఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

2.50 లక్షల మందికి లబ్ధి

● ఆర్టీసీలో వృద్ధులకు 25 శాతం రాయితీ

చిత్తూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ల దాటిన సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ శుభవార్త తెలిపింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వృద్ధులకు చార్జీల్లో 25 శాతం రాయితీ ప్రకటించింది. ఇది ఏ బస్సులోనైనా, ఏ రాష్ట్రం వారికైనా అమలయ్యేలా ఆదేశాలు జారీ చేసింది. ఇందుకుగాను వయసును ధ్రువీకరించే ఆధార్, పాన్, ఓటర్ గుర్తింపు కార్డులు కండక్టరుకు చూపించాలి. వీటికి సంబంధించిన ఫొటోలు ఫోన్లో ఉన్నా వాటిని చూపితే రాయితీ వర్తిస్తుంది. జిల్లా పరిధిలోని ఐదు డిపోల్లో నెలకు 37 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. వీరిలో 2.50 లక్షల మంది వరకు సినియర్ సిటిజన్లు ఉంటారని అధికారుల అంచనా. అదీ పల్లె వెలుగు బస్సుల్లోనే దాదాపు 2.20 లక్షల మంది రాకపోకలు సాగిస్తుంటారన్నారు. వీరందరికీ రాయితీ ఇవ్వడంతో ప్రభుత్వంపై నెలకు రూ.30లక్షల వరకు భారం పడనుంది.

26 మండలాల్లో వర్షం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 26 మండలాల్లో వర్షం కురిసింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. జీడీ నెల్లూరు మండలంలో అత్యధికంగా 17 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. చిత్తూరులో 15, కార్వేటినగరంలో 14.8, పూతలపట్టు, బైరెడ్డిపల్లెలో 14.2, వెదురుకుప్పంలో 10.4, సదుం, యాదమరిలో 9.8, ఐరాలలో 9.6, సోమలలో 8.4, నింద్రలో 7.2, బంగారుపాళ్యంలో 7, నగరి, పుంగనూరులో 6.2, పెనుమూరులో 6, తవణంపల్లెలో 5.2, పలమనేరు, గుడుపల్లెలో 5, చిత్తూరు రూరల్‌లో 4.8, విజయపురంలో 4.2, గంగవరంలో 3.8, ఎస్ఆర్‌పురం, వికోటలో 2.4, చౌడేపల్లెలో 2, పాలసముద్రంలో 1.4, పెద్దపంజాణిలో ఒక్క మి.మీ వర్షం కురిసింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ప్రసన్నయ్యగారిపల్లెలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ప్రసన్నయ్యగారిపల్లెలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

పుంగనూరు రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నయ్యగారిపల్లెలో రామస్వామి ఆలయం వద్ద ఆదివారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బందార్లపల్లె పంచాయతీలో పారిశుధ్య లోపం



రామకుప్పం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. నెర్నిల్లి గ్రామంలో 20 రోజుల క్రితం పైపులైను మరమ్మతు కోసం గొయ్యి తీశారు. పైపులైనును మరమ్మతు చేయకుండా కాలయాపన చేస్తుండడంతో అక్కడ మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో తాగునీరు కలుషితమవుతోందని గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా బగళనత్తం గ్రామంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పంచాయతీ అధికారులను పలుసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారరిశుధ్య చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

'చదవడం నాకిష్టం'పై పిల్లలకు పోటీలు



వ్యాసరచన పోటీలలో పాల్గొన్న చిన్నారులు

కుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చదవడం ఎప్పుడూ చిన్నారులకు ఇష్టమేగా. అదికూడా కథలు. అందుకే గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కుప్పం శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం నాకిష్టం' అనే అంశంపై పిల్లలకు పోటీలు నిర్వహించారు. చిన్నారులను వారు చదువుతున్న తరగతులను బట్టి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్‌గా విభజించి జ్యామితి, చిత్రలేఖనం, అంకెలను వెదకడం, తిరకాసు పదాలు, కథ చదివి తిరగరాయడంపై కూడా పోటీలు జరిపారు. గ్రంథాలయాధికారి సత్యవాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలో విజేతలను ఎంపికచేసి గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు ఇవ్వనున్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో యువకుడి అరెస్ట్

పుంగనూరు రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ, మండల పరిధిలో పలుచోట్ల చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న యువకుడిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన వివరాల మేరకు .. పుంగనూరు మండలం మోదుగులపల్లె పంచాయతీ లక్ష్మీపురంతాండాకు చెందిన బాలాజీనాయక్ కుమారుడు బుక్యా ప్రసాద్‌నాయక్(26) స్థానిక ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఈనెల 1, 2 తేదీల్లో పట్టణంలో రోడ్డుపై నడిచి వెళుతున్న మహిళ మెడలోని బంగారు చైను లాక్కెళ్లాడు. ఈనెల 15వ తేదీ సాయంత్రం మినీ బైపాస్‌రోడ్డులో వెళుతున్న మహిళ మెడలోని చైన్‌ను లాక్కున్నాడు. అంతలో స్థానికులు గుర్తించి పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విచారించగా నిందితుడు లోన్‌యాప్‌ల ద్వారా డబ్బు తీసుకుని అప్పులపాలై తిరిగి చెల్లించలేక ఒత్తిడిలో ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించినట్లు సీఐ వివరించారు. దీంతో నిందితుడిని చిత్తూరు ఎస్పీ మణికంఠచందోలు వద్ద హాజరుపరచి అతడి వద్ద నుంచి 69 గ్రాముల బంగారు ఆభరణాలు, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహిళలు బహిరంగ ప్రదేశాలకు వెళ్లే సమయంలో బంగారు ఆభరణాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్ర భవనం



సోమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం వల్లిగట్ల పంచాయతీ కొత్తపల్లెలో అంగన్‌వాడీ కేంద్రం పదేళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీకి నిధులు మంజూరై భవన నిర్మాణం చేపట్టారు.అనంతరం నిధుల కొరతతో ఆగిపోయింది. ఆగిపోయిన భవన నిర్మాణాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఓ అద్దె గదిలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. అసంపూర్తి భవనం నిరుపయోగంగా మారిపోయింది. అప్పటి నుంచి ఆ భవనం మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. అధికారులు స్పందించి అసంపూర్తి భవనాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వరసిద్ధుడి గోసంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ గోసంరక్షణ ట్రస్టుకు దివంగత బాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనుమళ్లు చినకాంపల్లెకు చెందిన చైతన్యరెడ్డి, రోహిత్‌రెడ్డిలు రూ.5,01,116 విరాళంగా ఆదివారం అధికారులకు అందించారు. అలాగే అన్నదానానికి పలమనేరుకు చెందిన కృష్ణయ్య రూ.1,00,116 (డీడీ) రూపంలో, యూఎస్‌ఏకి చెందిన బి.మహేష్ రూ.లక్షను చెక్కు రూపంలో అందించారు. దాతలను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో అ'పూర్వ' కలయిక

వెదురుకుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. 1986లో శిక్షణ పొందినవారు సమావేశమై ఆనాటి సంగతులను గుర్తుచేసుకుని సందడి చేశారు. అనంతరం స్టేజీ నిర్మాణానికి రూ.1.75లక్షల మెగా చెక్కును అందించారు. డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ లోకనాథంను సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

బంగారుపాళ్యం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని నలగాంపల్లె నంది ఫుడ్‌ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. నలగాంపల్లెకు చెందిన ఆబేలు తన ఆవులను మేపుకుని, రోడ్డు దాటి వస్తున్న సమయంలో టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆబేల్ (77) మృతిచెందాడు. మృతదేహాన్ని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

ఉచిత కంటి పరీక్షలు



పుంగనూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రతి రెండవ ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజీ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ చేసుకున్న వారికి మందులు, అద్దాలు, రవాణా ఖర్చులు అందజేస్తామన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

సింగిరిగుంటలో వైద్యశిబిరం



పుంగనూరు రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుపతి రమాదేవి ఆసుపత్రి వైద్యులు పుంగనూరు మండలం సింగిరిగుంటలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, షుగర్, బీపీ తదితర వాటికి పరీక్షలు నిర్వహించారు. అవసమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారికి రవాణా ఖర్చులు ఇవ్వనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, ఎంపీడీవో లీలామాధవి, కూటమి నాయకులు అంజిరెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 45 మంది ఎంపిక



పేర్లు నమోదు చేసుకుంటున్న కంటి రోగులు

కుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్య సిబ్బందిచే ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ శిబిరంలో 180 మంది కంటి రోగులను పరీక్షించారు. వీరిలో 45 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. వీరికి బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రిలో సోమవారం కంటి ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యబృందం శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

పుంగనూరు రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి):అక్రమ మార్గంలో మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణ సమీపంలోని హనుమంతరాయదిన్నె వద్ద తనిఖీలు చేస్తుండగా ప్రకాశంకాలనీకి చెందిన రామన్న కుమారుడు శ్రీనివాసులు(55) కర్ణాటక మద్యంతో పట్టుబడినట్లు తెలిపారు. అతని వద్ద 88 ప్యాకెట్లు మద్యం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే మండలంలోని బండ్లపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు మంజునాథ్‌రెడ్డి మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేయగా అతని వద్ద 11 బాటిళ్లు లభించినట్లు తెలిపారు. మంజునాథ్‌రెడ్డి అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కుప్పంలో గ్రీవెన్స్ డే

కుప్పం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కుప్పంలోని మండల సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటనుంచి మధ్యాహ్నం 1 గంటదాకా కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. వివిధ సమస్యలపై ప్రజలనుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడా పీడీ ప్రజలను కోరారు.

మొరంలో త్రైతసిద్ధాంత ప్రచారం

పలమనేరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం మొరం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రబోధానంద యోగీశ్వర్లు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ఇంటింటికి వెళ్లి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక పలమనేరు, బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షులు భాస్కర్, బాలాజి, ఉదయ్, రేఖ, కళ్యాణి, జీవరత్న, వింధ్య హేమంత్, జ్యోతి, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నైట్‌బీట్ సిబ్బందికి దుస్తుల అందజేత



పలమనేరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సబ్‌డివిజన్ పరిధిలో నైట్‌బీట్ చేసే పోలీసు సిబ్బంది కోసం డిజిటల్ దుస్తులను, సిగ్నల్ లైట్లను ఎస్పీ మణికంఠ చందోలు డీఎస్పీ డేగల ప్రభాకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, గంగవరం, చౌడేపల్లి, గంగవరం, పుంగనూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు నరసింహరాజు, మురళీమోహన్, రాంభూపాల్, ప్రసాద్, శ్రీనివాసులు, చిత్తూరు ఎస్పీ ఆఫీసు సీఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నత్తనడకన అగ్రిల్యాబ్ నిర్మాణం



సోమలలో నిర్మాణంలో ఉన్న అగ్రిల్యాబ్

సోమల, నవంబర్17(ఆంధ్రజ్యోతి): భూమిలో సూక్ష్మపోషకాల లోపాన్ని తెలుసుకుని తదనుగుణంగా పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించేందుకు భూసార పరీక్షలు తప్పనిసరి. ఈక్రమంలోనే ప్రభుత్వం అగ్రిల్యాబ్‌ల నిర్మాణాలు చేపట్టింది. గత ప్రభుత్వం సోమలలో మూడేళ్లక్రితం నియోజకవర్గ స్థాయి అగ్రిల్యాబ్‌కు రూ. 65 లక్షలు కేటాయించింది. ఈ క్రమంలోనే అగ్రిల్యాబ్ నిర్మాణ పనులను మార్కెట్‌యార్డు స్థలంలో చేపట్టారు. కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులను జాప్యం చేయడం, గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రైతుల్లో నిరాశ నెలకొంది. గతంలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్లకు ముందు వ్యవసాయాధికారులు పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి జిల్లా కేంద్రానికి పంపేవారు. భూసార పరీక్షలతో రైతులకు సాయిల్ హెల్త్ కార్డు అందజేసేవారు. ప్రస్తుతం అధికారులు మొక్కుబడిగానే కొందరి రైతుల పొలాల్లో భూసార పరీక్షలు చేయిస్తున్నారు. అధికారులు స్పందించి సోమలలో నత్తనడక సాగుతున్న పనులకు బిల్లులు మంజూరు చేసి రైతులకు అగ్రిల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పనులు వేగవంతం చేసేందుకు చర్యలు

సోమల మార్కెట్ యార్డులో అగ్రి ల్యాబ్ పనులు వేగవంతం చేసేందుకు జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించాం. అలాగే కాంట్రాక్టర్‌తో చర్చించి పనులు పూర్తి చేసి సదుం, చౌడేపల్లె, పులిచెర్ల, రొంపిచెర్ల, పుంగనూరు రైతులకు అగ్రిల్యాబ్ అందుబాటులోకి తెస్తాం.-ఏడీఏ శివకుమార్, పుంగనూరు

మొక్కుబడిగా సోమల శాఖా గ్రంథాలయం



సోమల శాఖా గ్రంథాలయానికి తాళం వేసిన దృశ్యం

సోమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సోమల శాఖా గ్రంథాలయానికి రెగ్యులర్ గ్రంథాలయాధికారి లేకపోవడంతో ఇన్‌చార్జి అధికారులచే మొక్కుబడిగా నడుస్తోంది. గత డిసెంబరులో ఇక్కడ పనిచేస్తున్న పార్ట్‌టైం వర్కర్ రామకృష్ణ పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచి నిత్యం మూతపడుతోంది. ఉదయం ఓ గంట మాత్రం తాళాలు తీస్తున్నారు. గత 10 సంవత్సరాల నుంచి 250 మంది సభ్యులు డిపాజిట్ చెల్లించినా పుస్తకాల పంపిణీ ఆగిపోయింది. అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాల కోసం విద్యార్థులు, నిరుద్యోగ యువత వచ్చినా గ్రంథాలయానికి తాళం వేసి ఉండడంతో నిరుత్సాహ పడుతున్నారు. రోజుకు ఓ గంటపాటు మొక్కుబడిగా దినపత్రికలు అందుబాటులో ఉంచుతున్నారు. పుస్తకాలు చూసే పరిస్థితి కానరావడం లేదని పాఠకులు వాపోతున్నారు. కలికిరికి చెందిన గ్రంథాలయ అధికారిని ఇన్‌చార్జిగా నియమించడంతో ఎప్పుడు వస్తారో తెలియడం లేదని, ఏటా నవంబరులో జరుపుకొనే గ్రంథాలయ వారోత్సవాలు కూడా జరగడం లేదు.

పలమనేరులో కవులకు సత్కారం



పలమనేరు, నవంబరు17 : పలమనేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం కవిసమ్మేళనం నిర్వహించారు. పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ కవులు తమ అక్షరకూర్పుతో భావితరాలను సన్మార్గంలో ముందుకు తీసుకెళ్లే వారే కవులన్నారు. జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ కవిలేని ప్రపంచం అంధకారమన్నారు. అనంతరం కవులను, సాహితీవేత్తలను సత్కరించారు. 30 మందికి పైగా విద్యార్థినులు తమ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హేమంత్‌కుమార్, పార్థసారధి, జక్కన్న, సయ్యద్‌మొహిద్దీన్, యోగాగురువు నందగోపాల్, గిరిధరమూర్తి, మల్లిచెట్ల దేవేంద్ర, రైతు సంఘం నాయకుడు ఉమాపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తి నాయుడికి ఘన నివాళి



రామ్మూర్తినాయుడి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న పీఎస్ఎం తదితరులు, కుప్పంలో టీడీపీ శ్రేణుల నివాళులు

కుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడికి కుప్పంలో ఆదివారం టీడీపీ శ్రేణులు ఘన నివాళి అర్పించాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట రామ్మూర్తి నాయుడు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించాయి. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్. మునిరత్నం, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కన్నన్ తదితరులు చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెలో నారా రామ్మూర్తినాయుడు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గ్రామీణ రోడ్లపై ప్రయాణం నరకం



నగిరేపల్లె, కొళత్తూరు, చెన్నారెడ్డిపల్లె సమీపాల్లో కంకర తేలి గుంతలు పడి ప్రమాదకరంగా మారిన రహదారులు

పెద్దపంజాణి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్ల అభివృద్ధికి నోచుకోక ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు పెద్దపంజాణి మండలంలో నెలకొన్నాయి. కంకరతేలిన, గుంతలమయమైన ఈ దారులలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారు లేకపోవడం బాధాకరం. నగిరేపల్లె నుంచి చెన్నారెడ్డిపల్లె వరకు, రాయలపేట నుంచి గౌదమాకులపల్లె వరకు, రాయలపేట రోడ్డు చీకలదిన్నెపల్లె నుంచి మద్దకుంట వరకు, లింగాపురం రోడ్డు నుంచి ముత్తుకూరు వరకు రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లు తేలికపాటి జల్లులకే ఛిద్రమవుతున్నాయి. కనీసం దెబ్బతిన్న రోడ్లలోని గుంతలకు మట్టి నింపాలని పలుమార్లు సూచించినా పట్టించుకునేవారు లేరు. కూటమి ప్రభుత్వంలోనైనా గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

కంకర తేలిన తారురోడ్డు



సరస్వతీపురం రోడ్డు దుస్థితి

సోమల,నవంబరు17(ఆంధ్రజ్యోతి) :సోమల మండలం నంజంపేట-సోమల మార్గంలోని సరస్వతీపురం వద్ద తారురోడ్డు కంకరరాళ్లు తేలిపోయి గుంతలు మయంగా మారింది. వర్షాలకు ఈమార్గంలో ప్రయాణం గగనంగా మారుతోంది. నిత్యం ఈమార్గంలో పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె, నంజంపేట, పొదలకుంటపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీ ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. ఈపంచాయతీలో పనిచేసే ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు తమ ద్విచక్రవాహనాల్లో ఈమార్గంలో ప్రయాణం సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు

నాగమంగళం వద్ద అధ్వానంగా సర్వీసు రోడ్డు



పలమనేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని నాగమంగళం వద్ద ఉన్న ఫ్లైఓవర్ సమీపంలో ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్డు అధ్వానంగా తయారైంది. కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. అంతేకాక ఈ సర్వీసు రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలను అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షపు నీటిలో ఈ గుంతలు తెలియక ద్విచక్రవాహన చోదకులు అందులో దిగి కంట్రోలు చేయలేక పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ గుంతలు పూడ్చివేసి సర్వీసు రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.





రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలు.. బురద నిండిన మట్టి రోడ్డు. ఈ దారిని చూస్తే ఇదెక్కడో మారుమూల పల్లెటూరు అనుకుంటే పొరపాటే. నగరంలోని 49వ డివిజన్ చవటపల్లె రోడ్డు దుస్థితి ఇది. నగరం రోజు రోజుకూ విస్తరిస్తున్నప్పటికీ దానికనుగుణంగా రోడ్లు, ఇతర మౌలిక వసతులు అభివృద్ధి చెందడం లేదనడానికి నిదర్శనం ఈ దారి.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

ఈ గుంతల్లో పడితే నడుము విరగాల్సిందే

30 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న జనం

సంతపేట నుంచి చవటపల్లె, ఇందిరానగర్, వెంగంపల్లె, మురకంబట్టు బైపాస్, ఇందిరమ్మకాలనీలకు ఈ దారిగుండానే జనం రాకపోకలు సాగించాలి. ఈ కాలనీల్లో చాలామంది దినసరి కూలీలు జీవనం సాగిస్తున్నారు. రోజూ నగరానికి వివిధ పనులపై వచ్చి సాయంత్రం, రాత్రి వేళల్లో ఇళ్లకు వెళుతుంటారు. ఆదమరిచి వాహనం నడిపి.. ఈ గుంతల్లో పడితే నడుము విరగాల్సిందే. వర్షాకాలంలో అయితే రోజూ ఎవరో ఒకరు ప్రమాదం బారిన పడుతున్నారు.పాలకులు, అధికారులు తాత్కాలిక మరమ్మతుల కింద రోడ్డుపై మట్టిని పోసి చేతులను దులుపుకుంటున్నారు. కొద్దిరోజులకే ఈ మట్టి కొట్టుకుపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30 ఏళ్లుగా తారు రోడ్డుకోసం నిరీక్షణ

చవటపల్లె నుంచి వెంగంపల్లె వరకు తారు రోడ్డు కోసం స్థానికులు 30ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. ఎన్నికల సమయంలో పాలకులు హామీలిస్తారు తప్ప ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. ఈ మట్టిరోడ్డులోనే పది వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ దారిలోనే క్యాంఫర్డ్ స్కూల్, సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కూడా వెళుతుంటారు.

విసిగిపోయాం



నాకు తెలిసి 20 ఏళ్లగా ప్రజా ప్రతినిధులు, అధికారులను అడిగి విసిగిపోయాం. ఎన్నికలు వచ్చినప్పుడు పెద్ద పెద్ద మాటలు అంటారు. తర్వాత పట్టించుకోవడమే మానేస్తారు. ఆ గ్రీవెన్స్‌డే కార్యక్రమాల్లో అర్జీలిచ్చి అలసిపోయాం. దాంతో అడగటమే మానేశాం

- బాబురెడ్డి, షుగర్ ఫ్యాక్టరీ క్వార్టర్స్

సొంత డబ్బులతో మట్టి పోస్తున్నా



నాకు ఇప్పుడు 35 ఏళ్లు. ఊహ తెలిసినప్పటి నుంచి ఈ రోడ్డు పరిస్థితి ఇలానే ఉంది. నేను కాంట్రాక్టర్ అయినందు వల్ల వర్షం వచ్చినప్పుడు.. ఆ తర్వాత కూడా అప్పుడప్పుడు గుంతలు ఏర్పడినప్పుడు సొంత డబ్బులతో మట్టి పోస్తున్నాను. నా కళ్లముందే చాలా మంది ప్రమాదాల్లో గాయాల పాలయ్యారు.

- జ్యోతీశ్వరన్, తిమ్మసముద్రం

పెండింగ్ జీతాలివ్వండి: స్వీపర్ల ధర్నా



పెనుమూరు ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న స్వీపర్లు

పెనుమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు పెండింగ్ జీతాలను చెల్లించాలని స్వీపర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పెనుమూరు ఎంపీడీవో కార్యాయలం ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వంలో సుమారు 20 నెలల జీతాలు చెల్లించలేదని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వం జోక్యం చేసుకుని, ఐదు నెలల జీతాలను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. స్వీపర్ల యూనియన్ నాయకురాలు జయకుమారి, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు, నాయకులు దాసరి చంద్ర, దామోదరం, రఘు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధికారులు సహకరించాలి: ఎంపీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న అమరావతి

బంగారుపాళ్యం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు తమకు సహకరించాలని అధికారులను సూచించారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అమరావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమస్యలపై చర్చించారు. రాగిమానిపెంట సర్పంచ్ తోట హరి మాట్లాడుతూ తమ గ్రామంలో 11కేవీ విద్యుత్ వైర్లు ఇళ్లపైనే ఉన్నాయని, పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. 170గొల్లపల్లి సర్పంచ్ కోక ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ తొలగించిన వీరప్పనాయని చెరువు ఆయకట్టుదారుల పేర్లను తిరిగి ఓటరు జాబితాలో నమోదుచేయాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

చిత్తూరు కల్చరల్/రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా సాహితీవేత్తలను అధికారులు సత్కరించారు. డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, జిల్లా రచయితలు సంఘం అధ్యక్షుడు గిరిధర్, రచయిత మిట్టా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పుస్తకపఠనంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



రచయితలను సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారులు

వరసిద్ధుడి గోసంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



గో సంరక్షణ ట్రస్టుకు నగదు అందిస్తున్న దాతలు

ఐరాల(కాణిపాకం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ గోసంరక్షణ ట్రస్టుకు దివంగత బాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనుమళ్లు చిన కాంపల్లెకు చెందిన చైతన్యరెడ్డి, రోహిత్‌రెడ్డిలు రూ.5,01,116 విరాళంగా ఆదివారం అధికారులకు అందించారు. అలాగే అన్నదానానికి పలమనేరుకు చెందిన కృష్ణయ్య రూ.1,00,116 (డీడీ) రూపంలో, యూఎస్ఏకి చెందిన బి.మహేష్ రూ.లక్షను చెక్కు రూపంలో అందించారు. దాతలను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణకు కృషి చేయండి



బహుమతి గ్రహీతలతో నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ప్రముఖ సాహితీవేత్త మద్రిపూడి దేవేంద్రరావు అన్నారు. ఆదివారం పలమనేరు రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. సామాజిక కార్యకర్త కోటేశ్వరన్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నగరంలోని కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి: బీజేపీ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం అధ్యక్షతన సభ్యత్వ కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. దొరబాబు, విశాల్ జైన్, షేక్‌రెడ్డి మస్తాన్, కరుణాకర్, సిద్ధు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డైట్‌లో అ'పూర్వ' కలయిక

వెదురుకుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. 1986 విద్యా సంవత్సరంలో శిక్షణ పొందినవారు సమావేశమైన ఆనాటి సంగతులను గుర్తుచేసుకుని సందడి చేశారు. అనంతరం స్టేజీ నిర్మాణానికి రూ.1.75లక్షల మెగా చెక్కును అందించారు. డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ లోకనాథం తదితరులను సత్కరించారు.



ఫ్రీహోల్డ్ రైట్స్‌లో అరవై శాతం బోగస్

వెదురుకుప్పం మండల సమావేశంలో తహసీల్దార్ రమేష్‌బాబు



ప్రసంగిస్తున్న ఎంపీపీ నాగరాణి, వేదికపై ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో అమరనాథ్, జడ్పీటీసీ సుకుమార్, తహసీల్దారు రమేష్‌బాబు

వెదురుకుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలో చాలా భూములకు బోగస్ పాసుపుస్తకాలే ఉన్నాయని తహసీల్దార్ రమేష్‌బాబు స్పష్టం చేశారు. ఆదివారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం ఎంపీపీ నాగరాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో కూడా తప్పిదాలే ఉన్నాయని, ఇటీవల చేపట్టిన ఫ్రీహోల్డ్ రైట్స్‌లో అరవై శాతం బోగస్ సిఫార్సులు జరిగాయని తెలిసి రిజెక్ట్ చేశానని చెప్పారు. ప్రజాప్రతినిధుల్లో కొందరు దళారీలు ఉన్నారన్న ఆయన వారితో కాకుండా ప్రజలే కార్యాలయానికి రావాలని ఆంక్షలు పెట్టినట్లు చెప్పారు. జడ్పీటీసీ సుకుమార్ మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయంలో ఉండాల్సిన చాలా రికార్డులు దళారీల చేతుల్లో ఉన్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీటీసీ మురళీరెడ్డి మాట్లాడుతూ.. ఫ్రీహోల్డ్ రైట్స్ తప్పిదాలకు బాధ్యులెవరని ప్రశ్నించారు. కో-ఆప్షన్ మెంబరు పి.వెంకటేశులు మాట్లాడుతూ తన భూమి 2ఎకరాల 70 సెంట్లు ఉంటే రీసర్వే పేరిట ఎకరం 70 సెంట్లు చూపించారనగా తహసీల్దార్ మాట్లాడుతూ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. బోగస్ రికార్డులను గుర్తించి ఇప్పటికే ఆరు కేసులు నమోదు చేయించినట్లు వెల్లడించారు. ఎంపీడీవో అమరనాథ్, ఈవోపీఆర్డీ పురుషోత్తం, పరిపాలనాధికారి నాగమణి, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, ఏపీఎం పరశురామిరెడ్డి, ఏపీవో ఇందు, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రంగనాథం, గాయత్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల హాజరయ్యారు.

సచివాలయంలో పనిచేయని ప్రింటర్

ఇబ్బంది పడుతున్న జనం

గుడిపాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామభద్రాపురం పంచాయతీలోని సచివాలయంలో ప్రింటర్ పనిచేయక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. నివాస, కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, వన్-బీ కోసం రైతులకు అవస్థ తప్పడం లేదు. ఎనిమిది నెలలుగా ప్రింటర్ పనిచేయం లేదని, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వృద్ధులకు అన్నదానం

చిత్తూరు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తపోవనం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు తన తండ్రి ముత్తుస్వామి జయంతి సందర్భంగా రమేష్ ఆదివారం అన్నదానం చేశారు. ఏపీ కరణం సంఘ సెక్రటరీ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర గవర్నర్‌ను కలిసిన ఎంపీ



చిత్తూరు సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌ను తిరుపతి విమానాశ్రయంలో ఆదివారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనవెంట మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ తదితరులున్నారు.

రామ్మూర్తి నాయుడికి టీడీపీ నేతల నివాళి



గంగాధరనెల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం సోదరుడైన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి చిత్రపటానికి ఆదివారం గంగాధరనెల్లూరు బస్టాప్‌కూడలిలో టీడీపీనేతలు పూలమాల వేసి, నివాళి అర్పించారు. పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, మండల అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, నేతలు ప్రకాష్, విశ్వనాథం, ఆనంద్‌బాబు, హరిప్రకాష్, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

చిత్తూరు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ముందస్తు సమాచారంతో చెన్నమగుడిపల్లెలో ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ప్రకాష్, సతీష్, రమేష్, రవి, మహేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,050, ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కఠారి దంపతులకు నివాళి



కటారి దంపతుల సమాధి వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ మేయర్ దివంగత కటారి అనురాధ, మోహన్ దంపతుల వర్ధంతి సందర్భంగా టీడీపీ నేతలు నివాళి అర్పించారు. ఆదివారం గంగనపల్లెలోని కటారి దంపతుల సమాధికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా గాంధీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఎమ్మెస్సార్ సర్కిల్, కొంగారెడ్డిపల్లె, లెప్రసీ కాలనీ, సాంబయ్య కండ్రిగ, మురకంబట్టు తదితర ప్రాంతాల్లో కటారి దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, పేదలకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, కిరణ్, కటారి లావణ్య, చంద్రప్రకాష్, కోదండయాదవ్, మోహన్‌రాజ్, కంద, రాజశేఖర్, ఆరణి తులసి, బాలాజీ, గోపి, కిషోర్, డేగల రమేష్, రాణి, వరలక్ష్మి, లత, కోలా ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పగలే వెన్నెల



వెదురుకుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం సీడీకండ్రిగలో పగలు రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. పగలు కూడా వీధి దీపాలు వెలగడం వల్ల విద్యుత్ వినియోగం పెరగడంతోపాటు లైట్లు కాలిపోయే అవకాశం ఉంది. ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధంగా బస్‌షెల్టర్



పాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో రాచపాళ్యం వద్ద ఉన్న బస్‌షెల్టర్ కూలడానికి సిద్ధంగా ఉంది. సుమారు 30 సంవత్సరాల కిందట ఎంపీ నిధులతో నిర్మించిన ఈ బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడంతో బీటలు వారి మోల్డింగ్ పైకప్పు పెచ్చులూడిపోయింది. ప్రయాణికులు కూర్చోవడానికి వేసిన కడప బండలను సైతం దొంగిలించుకెళ్లారు. కూడలి ప్రాంతం కావడంతో ఇక్కడ ఎక్కువ మంది ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు. శిథిలావస్థలో ఉన్న ఈ బస్‌షెల్టర్ కింద కాకుండా రోడ్డు పక్కన ఉన్న చెట్ల కింద ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తోంది. వర్షం కురిసినపుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా కొత్త బస్ షెల్టర్ నిర్మించాల్సి ఉంది.

లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు



గంగాధరనెల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలోని లక్ష్మీనారాయణులకు అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి రెడ్డెమ్మ హరికథాకాలక్షేపం చేయగా, అన్నమయ్య కీర్తనలను రాజేష్‌బాబు ఆలపించారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన మురళి

శ్రీరంగరాజపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఎంపీడీవో మోహన మురళి అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ ఎంపీటీసీ సిద్దయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు, తదితర సమస్యలను తమ దృష్టికి తేవాలని ఎంపీడీవో సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మాజీమంత్రికి సత్కారం



రోజాకు శుభాకాంక్షలు తెలిపిన గోవర్ధన్‌నాయుడు

విజయపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఆర్కే రోజా జన్మదినాన్ని ఆదివారం నగరిలో ఘనంగా నిర్వహించారు. వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ చైర్మన్ భూమనకరుణాకర రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు గోవర్ధన్‌నాయుడు, శోభారామ కృష్ణమరాజు, నాయకులు కిషోర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సతీష్‌యాదవ్, బాలకృష్ణనాయుడు, కుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు

జీడీనెల్లూరు నియోజకవర్గంలో రూ.11.90కోట్లతో సిమెంట్ రోడ్లు

గంగాధరనెల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలు మారుతున్నాయి. గ్రామాల్లో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో ఇటు జనం, అటు నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి రూ.11.90కోట్లతో 210 చోట్ల సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులు మంజూరు అయ్యాయి. మండలాల వారీగా.. గంగాధరనెల్లూరులో 39 పనులకు రూ.1.59కోట్లు, కార్వేటినగరంలో 31 పనులకు రూ.4కోట్లు , పెనుమూరులో 62 పనులకు రూ.2.11కోట్లు, శ్రీరంగరాజుపురంలో 21 పనులకు రూ.1.75కోట్లు, వెదురుకుప్పంలో 56 పనులకు రూ.1.75కోట్లు, పాలసముద్రంలో 4 పనులకు రూ.70లక్షలతో పనులు మంజూరు చేశారు.

సిమెంటు రోడ్లున్నా తప్పని తిప్పలు



టీవీకండ్రిగలో సిమెంటురోడ్డుపై నిలిచిన వర్షపునీరు

నగరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలో సిమెంటు రోడ్లున్నా ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వర్షం వస్తే రోడ్లపై నీరు నిలిచిపోతోంది. దీనికి నిదర్శనమే.. టీవీకండ్రిగలోని సిమెంటురోడ్డు.

సంక్షిప్తంగా..

ఉచిత నేత్ర వైద్యశిబిరం

చిత్తూరు కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేలూరు రోడ్డులోని సద్గురు సేవాశ్రమంలో ఆదివారం అమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. బెంగళూరు శంకర నేత్ర వైద్యశాల వైద్యుల సహకారంతో జరిగిన ఈ శిబిరంలో ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు.

ఉద్యోగికి సన్మానం

వెదురుకుప్పం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తూ నింద్ర ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంటుగా వెళుతున్న త్యాగరాజును ఆదివారం ఎంపీడీవో చంద్రమౌళి, ఎంపీపీ లత, ఉద్యోగులు సన్మానించారు.

యోగాతోనే ఆరోగ్యం



చిత్తూరు సెంట్రల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా ఉంటామని యోగా మాస్టర్ మోహన్ బెహరా అన్నారు. ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా ఆదివారం క్యాడెట్లకు యోగాలో మెలకువలను తెలియజేశారు. 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ మోనిస్, ఏవో మేజర్ లోకనాథ్‌లు, ఎన్‌సీసీఅధికారులు ప్రసాద్‌రెడ్డి, బాలాజీ, యుగంధర్, కార్తీక్, మహేష్‌బాబు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



ఆబేల్ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని నలగాంపల్లె నంది ఫుడ్‌ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నలగాంపల్లెకు చెందిన ఆబేలు తన పాడిఆవులను మేపుకుని, రోడ్డు దాటి గ్రామానికి వస్తున్న సమయంలో చిత్తూరు నుంచి పలమనేరు వైపు వెళ్తున్న టెంపో ట్రావెలర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆబేల్ (77) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

చిత్తూరు సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ సీఐ శ్రీహరి రెడ్డి చెప్పారు. నగరంలోని చిత్తూరు - తిరుపతి రోడ్డులో నిర్వహించిన తనిఖీల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఎస్టీవీ నగర్‌కు చెందిన ఉదయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 10 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంగాధరనెల్లూరు మండలం చిత్తూరు-బాల గంగనపల్లె రోడ్డులోని పీవీ నత్తం క్రాస్ వద్ద వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని, 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.